క్లుప్తంగా

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

గూడూరు: గూడూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 12న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కె.వి.రామకృష్ణ తెలిపారు. ఎంపీపీ సంగా మధుసూదనరావు అధ్యక్షతన శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులంతా హాజరుకావాలని ఆయన కోరారు.

నేత్ర దానం


మృతురాలు మణికుమారి(ఫైల్)

నాగాయలంక: గ్రామంలోని ఆరో వార్డుకు చెందిన వంట మేస్త్రి చుండూరు మణికుమారి (66) అనారోగ్యంతో బుధవారం మరణించగా ఆమె నేత్రాలను స్థానిక సుదర్శి మానవతా సేవాసంస్థ ద్వారా విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. స్థానిక సాయి మెస్ అధినేత చుండూరు నరసింహారావు ప్రోత్సాహంతో నేత్రదానం జరిగింది. గతంలో ఆమె భర్త ప్రసాద్ నేత్రాలను కుమారి దానం చేశారు. మరో ఇద్దరికి చూపునిచ్చే అవకాశం కల్పించాలనే సంకల్పంతో మణికుమార్ కుమార్తె చందోలు సత్యవతి, అల్లుడు శ్రీకాంత్ నేత్ర దానానికి ముందు కొచ్చారు.

ఘనంగా గ్రామోత్సవం

బంటుమిల్లి: మండల పరిధిలోని పెందుర్రు గ్రామంలో వినాయక చవితి పూజలు అందుకున్న గణనాథుడిని బుధవారం మేళతాళాలు, కనకతప్పెట్లు, డీజే పాటలకు అనుగుణంగా యువకులు నృత్యాలు చేస్తూ గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. మండలంలో మొదటిసారి గ్రామంలో దాదాపు 13 అడుగుల వినాయక ప్రతిమను నిలిపి యువకులు భక్తి, శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. గ్రహణం కారణంగా నిమజ్జనం వాయిదా వేసిన నిర్వాహకులు గ్రామోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రతి ఇంటి ముందు ఆపి నీటి బిందెలతో వారు పోసి హారతులు ఇచ్చి, టెంకాయలు కొట్టి బొజ్జగణపయ్యకు పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్న ప్రసాద కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రూ.25వేలతో బాలలకు ప్లేట్లు వితరణ



కమ్మనమోలు(నాగాయలంక): గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 130 మంది బాలబాలికలకు రూ.25వేల విలువైన భోజనం ప్లేట్లు, స్కూలు డైరీలు, గుర్తింపు కార్డులను బుధవారం పంపిణీ చేశారు. పాఠశాలలో సోషల్ టీచర్‌గా పనిచేస్తున్న మేడా బాబ్జి తన తల్లిదండ్రులు మేడా నారాయణరావు, మునిమ్మ జ్ఞాపకార్థం వీటిని సమకూర్చారు. మండల విద్యాశాఖ అధికారులు సనకా శ్రీకాంత్, అన్నపరెడ్డి రామారావు, కాంప్లెక్స్ చైర్మన్ ఇంకొల్లు చంద్రశేఖర్ చేతులమీదుగా బాలలకు అందజేశారు. ఈ సందర్భంగా దాత బాబ్జిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పెద్దలు బొడ్డు విజయ్, నక్కా విజయబాబు, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ కె.దుర్గాభవాని, హెచ్ఎం తుంగల విశాలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమతుల ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

గూడూరు: సమతుల ఆహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యు.ఉషశ్రీ అన్నారు. పౌష్టికాహార వారోత్సవాలలో భాగంగా బుధవారం మండల పరిధిలోని గూడూరు, కప్పలదొడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో కిశోర బాలికలకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాట్లాడుతూ బాలికలు పరిశుభ్రతను పాటించాలన్నారు. తద్వారా ఎలాంటి ఆరోగ్య సమస్యలు దరిచేరవన్నారు. విటమిన్లు, ప్రొటీన్లు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా శారీరకంగా ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. ప్రతి రోజూ ఆహారంతో పాటుగా పాలు, గుడ్డు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఐసీడీఎస్ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తిచేయాలి

ఘంటసాల: మండలంలో గత ప్రభుత్వంలో మంజూరు చేసి వివిధ దశల్లో ఉన్న గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో కేజే శ్రీనివాస చంద్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గృహనిర్మాణ శాఖపై బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణ శాఖ ఏఈ జి.సురేంద్ర మాట్లాడుతూ మండలంలో శ్లాబు వేసేందుకు (ఆర్ఎల్) 60 గృహాలు, సన్‌సైడ్ (ఎల్ఎల్) లెవెల్లో 254 గృహాలు, శ్లాబు పూర్తి చేసి ప్లాస్టింగ్ (ఆర్‌సీ) లెవల్లో 29 గృహాలు ఉన్నట్లు తెలియజేశారు. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ఉన్నతి పథకం కింద బ్యాంకుల ద్వారా రూ.50 వేలు, బీసీ, ఓసీలకు స్త్రీ నిధి ద్వారా వడ్డీతో రూ.50 వేలు గృహ నిర్మాణాలకు అందిస్తారన్నారు. అనంతరం ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస చంద్ మాట్లాడుతూ గ్రామ సచివాలయాల్లోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు బాధ్యత తీసుకుని సంబంధిత లబ్ధిదారులతో త్వరితగతిన ఇళ్లు పూర్తి అయ్యేలా ప్రోత్సహించాలన్నారు.

నారుకు కన్నీరు


కృత్తివెన్ను మండలం చినగొల్లపాలెం చానల్‌పై ఎండిపోతున్న నారును కాపాడుకునే ప్రయత్నం చేస్తున్న రైతులు

- సాగుకు నీరివ్వకుండా చేపల చెరువులకు ఇస్తున్న వైనం
- సాగునీరందక 150 ఎకరాల్లో పంట వేయనేలేదు
- అక్రమంగా చానల్ పగులగొట్టినా పట్టించుకోని అధికారులు

కృత్తివెన్ను: కృత్తివెన్ను మండలం చినగొల్లపాలెం చానల్ పరిధిలోని రైతులు ఖరీఫ్ సాగుకోసం నెల రోజుల క్రితం నారుమడి వేశారు. తీరా చూస్తే తమ సబ్‌చానల్‌కు సాగునీరు సరఫరా లేకుండా పోయింది. దీంతో చేసేది లేక కళ్ల ముందే చనిపోతున్న నారును బతికించుకోవాలనే తపనతో నీటిని తెచ్చుకుని బిందెలు, బకెట్లతో తడుపుకొంటున్నారు.

చేపల చెరువులకు పుష్కలంగా నీరందిస్తూ వరికి మాత్రం ఉరి వేస్తున్నారని.. కేవలం అధికారుల అలసత్వం కారణంగానే సుమారు 150 ఎకరాల్లో వరిపంటను వేయకపోగా వేసిన నారుకు సైతం నీరులేక ఎండిపోతోందని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. కృత్తివెన్ను మండలం చినగొల్లపాలెం చానల్‌పై రైతులు నారుమడులు వేసుకుని నీటి కోసం ఎదురు చూస్తున్నా అతీగతీ లేకుండా పోయింది.

చేపల చెరువులకు పుష్కలంగా..

ఇదే బ్రాంచి చానల్‌పై ఎగువనున్న దోమలగొంది చానల్‌ను కొందరు వ్యక్తులు అనధికారికంగా పగులగొట్టి వస్తున్న నీటిని యథేచ్ఛగా చేపల చెరువులకు మళ్లిస్తున్నా అధికారులు కనీసం అటువైపు కన్నెత్తయినా చూడటం లేదని రైతులు వాపోతున్నారు. దీని కారణంగా తమకు రావాల్సిన నీరు రాకుండా పోయిందని దీంతో ఇప్పుడు తమ నారుమడులు ఎండిపోయి చనిపోతున్నాయని అధికారుల తీరుపై మండిపడుతున్నారు.

వరదలు వచ్చినా ఇక్కడ సాగునీటికి కరువే..

కృష్ణానదికి వరదలు వచ్చి నీటిని సముద్రానికి వదిలేసినా ఇక్కడ మాత్రం చుక్కనీరు లేదని.. పంట ఎండిపోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సబ్ చానల్ కాంక్రీట్ పగులగొట్టినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాగునీటి కొరతపై ఏఈఈ రాజ్యలక్ష్మిని ప్రశ్నించగా ఎగదన్నుకు వస్తున్న ఉప్పునీటిని రైతులు బయటకు తోడుకోవాలని, కాలువ ద్వారా వచ్చే నీరు ఉప్పునీటి తీవ్రతను అడ్డుకోలేకపోతుందని ఆ స్థాయిలో నీరు ఇవ్వలేకపోతున్నామని తెలిపారు.

చుక్కనీరు రాలేదు



నేను ఐదెకరాలు వ్యవసాయం చేస్తున్నాను. దానికి సరిపడా నారు పోసుకున్నా. నెలరోజులు పైనే కావస్తున్నా చుక్కనీరు రాలేదు. నారుమడి ఎండిపోయింది. ఎక్కడి నుంచో నీటిని బిందెలతో తెచ్చుకుని నారు బతికించే ప్రయత్నం చేస్తున్నాను. ఇది చాలా దారుణం. అధికారులు ఏం చేస్తున్నారో తెలియడం లేదు.

– పులగం పెద్దబ్బులు, రైతు, లక్ష్మీపురం

నారు ఎండిపోయింది



దోమలగొంది చానల్‌ను దౌర్జన్యంగా పగులగొట్టి సాగునీటిని చేపల చెరువులకు మళ్లిస్తున్నారు. దీనిని అధికారులు పట్టించుకోవడం లేదు. నేను ఐదు ఎకరాలు సాగు చేయడానికి నారు వేశాను. నీరులేక నారు ఎండిపోయింది. నీరు లేక ఈ ఏరియాలో 150 ఎకరాలకు పైగా పంట భూములు బీళ్లుగా వదిలేయాల్సి వచ్చింది.

– యాళ్ల లోకనాథ్ చక్రవర్తి, రైతు


చినగొల్లపాలెం చానల్‌పై ఎండిపోయి చనిపోయిన నారుమళ్లు

వర్షాకాలంలో విద్యుత్ కోతలేంటి?

మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మండిపాటు


విద్యుత్ సరఫరాపై సబ్‌ఇంజనీర్‌ను ప్రశ్నిస్తున్న ఎంపీపీ గరుడప్రసాద్

కృత్తివెన్ను: వర్షాకాలంలో కూడా ఇష్టానుసారంగా విద్యుత్ కోతలు విధిస్తూ ప్రజలతో పాటు ఆక్వా రైతులను తీవ్ర ఇక్కట్లపాలు చేస్తున్న విద్యుత్ శాఖ తీరుపై మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్ మండిపడ్డారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్యసమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ గతంలో వేసవి కాలంలో మాత్రమే నిర్దేశించిన సమయంలో విద్యుత్ కోతలు ఉండేవని, ఇప్పుడు అన్నికాలాల్లోనూ ఇష్టానుసారంగా కోతలు విధిస్తూ ప్రజలను, ఆక్వా రైతులను ఇబ్బందులకు గురిచేయడం ఏమిటని విద్యుత్ శాఖ సబ్‌ఇంజినీర్‌ను నిలదీశారు. మండలంలో లోఓల్టేజ్ సమస్య తీవ్రంగా ఉందన్నారు. విద్యుత్ సరఫరాలో తీవ్రమైన వివక్ష చూపుతున్నారని, కొన్ని ఫీడర్‌లకు 24 గంటలు విద్యుత్ సరఫరా చేస్తూ మిగిలిన ప్రాంతాలలోని ఆక్వారైతులకు కేవలం నాలుగైదు గంటలకు మించి సరఫరా ఉండటం లేదంటూ డీసీ చైర్మన్ ఎన్‌వీ భాస్కరరావు అధికారులను నిలదీశారు. చినగొల్లపాలెం చానల్‌కు నీరురావడం లేదని అక్కడి రైతులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై ఏఈఈ రాజ్యలక్ష్మిని జెడ్పీటీసీ సభ్యురాలు రత్నకుమారి నిలదీశారు. ఏకంగా సబ్‌చానల్ షట్టర్‌ను ధ్వంసం చేసిన వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు ఆ చానల్‌పై అధికారికంగా ఎన్ని పైపులున్నాయో మీకైనా తెలుసా అని ప్రశ్నించారు. తాగునీరు రావడం లేదని, కనీసం దాని గురించి పట్టించుకునే అధికారులే కరువయ్యారంటూ పల్లెపాలెం ఎంపీటీసీ సభ్యుడు కృష్ణ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పనితీరుపై ప్రశ్నించారు. మండలం అంతా సమస్యలమయంగా ఉందని ప్రభుత్వ యంత్రాంగం నుంచి సరైన స్పందన లేదంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో మార్కెట్‌యార్డు చైర్మన్ తులసీరావు, వైస్ఎంపీపీలు సత్యనారాయణ, శిరీష, ఎంపీడీవో అరుణకుమారి, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరయ్యారు.

పగిలిన మంచినీటి పైపులైన్

మోపిదేవి: మండల కేంద్రం మోపిదేవి ప్రధాన రహదారిలో మంచినీటి పైప్‌లైన్ పగిలి మురుగునీరు వస్తున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికే గ్రామంలో ఇంటికో మనిషి అనారోగ్యంతో బాధపడుతున్నారు. గ్రామ కార్యదర్శికి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్రామ సచివాలయం పక్కనే పైప్‌లైన్ పగిలి మురుగునీరు బయటకు వస్తున్నా, నిత్యం ఆ మార్గంలో ప్రయాణించే సచివాలయ అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం. గ్రామానికి రాష్ట్ర నలుమూలల నుంచి నిత్యం స్వామివారి దర్శనానికి వస్తుంటారని, ఇక్కడ మంచినీళ్లు తాగితే భక్తులకు కూడా అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వెంటనే పైప్‌లైన్ మరమ్మతులు చేసి మంచి నీరు అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పాముకాటుతో రైతు మృతి


మృతుడు వెంకట్రావు

కోడూరు: పశువులకు మేత కోసేందుకు వెళ్లిన రైతు పాముకాటుతో మృతిచెందిన ఘటన కోడూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ చాణిక్య తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని నరసింహపురం గ్రామానికి చెందిన రైతు చింతా వెంకట్రావు (50) రోజూ మాదిరిగానే బుధవారం ఉదయం పశువులకు పశుగ్రాసం (పచ్చగడ్డి) కోసేందుకు పొలం గట్టు వద్దకు వెళ్లాడు. వెంకట్రావు గట్టుపై గడ్డి కోస్తుండగా అందులో దాగి ఉన్న పాము అతని ఎడమ చేయి బొటన వేలుపై కాటేసింది. స్థానికులు వెంకట్రావును హుటాహుటిన అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు. మృతదేహానికి పోస్టుమార్టం జరిపి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

కార్తికేయుని సన్నిధిలో సింహాచలం ఆర్‌జేసీ


కృష్ణాజిల్లా మోపిదేవిలో స్వామివారి చిత్రపటం అందుకుంటున్న ఆర్‌జేసీ త్రినాథరావు

మోపిదేవి(కృష్ణాజిల్లా): కృష్ణాజిల్లా మోపిదేవిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారిని సింహాచలం ఆర్‌జేసీ, ఈవో వి.త్రినాథరావు బుధవారం దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన ఆయన నాగపుట్టలో పాలు పోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు బుద్దు ఫణికుమార్‌శర్మ, వెంకటేశ్వరరావు స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదాలు అందించి ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

పులిగడ్డ(అవనిగడ్డ): పులిగడ్డ పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం బాల్యవివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ దాసరి విజయ్‌కుమార్ మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. వాసవ్య మహిళా మండలి జిల్లా ప్రతినిధి మండలి ఉషారాణి మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఈవో అనిత, మండల కో ఆర్డినేటర్ పీహెచ్ శాంతితో పాటు పలువురు అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్లు, సచివాలయ ఉద్యోగులు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మలేరియా, డెంగీ జ్వరాలతో అప్రమత్తం


దాలిపర్రులో మలేరియా, డెంగీ అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

దాలిపర్రు(ఘంటసాల): మలేరియా, డెంగీ జ్వరాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చల్లపల్లి సబ్ యూనిట్ అధికారి పీఎస్ రాజు అన్నారు. ఘంటసాల మండలం దాలిపర్రు గ్రామంలో మలేరియా, డెంగీ అవగాహన సదస్సు, ర్యాలీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. ముందుగా హెచ్‌డబ్ల్యూసీలో రికార్డులను రాజు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఘంటసాల పీహెచ్‌సీ సూపర్‌వైజర్ కె.పూర్ణ చంద్రరావు, ఎంపీహెచ్ఏ(ఎం) సీహెచ్ శ్రీనివాసరావు, ఎంపీహెచ్ఏ(ఎఫ్) డి.సునీత, ఎంపీపీ స్కూల్ హెచ్ఎం జి.శ్రీనివాసరావు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

22 నుంచి మూడు జిల్లాల స్థాయి తాళం భజన పోటీలు

ఈ నెల 18 లోగా దరఖాస్తు చేసుకోవాలి

చిట్టూర్పు(ఘంటసాల): దసరా నవరాత్రుల సందర్భంగా ఈ నెల 22 నుంచి మండలంలోని చిట్టూర్పు గ్రామంలో మూడు జిల్లాల స్థాయి తాళం భజన పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పాడుగు ప్రభాకర్, పువ్వుల శ్రీనివాస్, కె.నాగేశ్వరరావు, గుత్తికొండ వర ప్రసాదరావు, డాక్టర్ ఎం.జయశ్రీ బుధవారం తెలిపారు. గ్రామంలోని శివాలయ ప్రాంగణంలో ఈ నెల 22 నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు జరిగే కృష్ణా, ఎన్టీఆర్, నెల్లూరు జిల్లాల స్థాయి తాళం భజన పోటీల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీ ఉదయం 8 గంటలకు చిట్టూర్పు శివాలయంలో పోటీలను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రారంభిస్తారని చెప్పారు. పోటీల్లో పాల్గొనే వారు ఈ నెల 18వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 20న ఏయే సమాజాల వారు ఏఏ తేదీల్లో పాల్గొనాలనే సమాచారాన్ని ప్రకటిస్తామన్నారు. తాళం భజన పోటీల్లో పాల్గొనే వారు కనీసం 8 మంది సభ్యులు ఉండాలని, వాయిద్య కళాకారులు అదనంగా ఉండొచ్చన్నారు. ఒక గురువు ఒక సమాజంలోనే పాల్గొనాలని తెలిపారు. ఆయా పోటీల్లో విజేతలకు అక్టోబర్ 3న బహుమతి ప్రదానోత్సవం జరుగుతుందని, తాళం భజనలో మొదటి బహుమతి రూ.10 వేలు, రెండో బహుమతి రూ.5 వేలు, మూడవ బహుమతి రూ.3 వేల నగదు అందించడంతో పాటు మురళీ కోలాటంలో పాల్గొనే వారికి కూడా బహుమతులు అందిస్తామన్నారు. పోటీల పూర్తి వివరాలకు 92474 43763, 81793 22189 ఫోన్ నంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయుడు మణి మాస్టారుకి నివాళి


మణిప్రభాకరరావు చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించిన శిష్యులు, గ్రామ ప్రముఖులు

చల్లపల్లి: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, విద్యాదాత దివంగత కొక్కిలిగడ్డ మణిప్రభాకరరావు మాస్టారి 78వ జయంతి కార్యక్రమాన్ని పూర్వ విద్యార్థులు, గ్రామ ప్రముఖులు మండల పరిధిలోని వక్కలగడ్డలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మణిప్రభాకరరావు చిత్రపటం వద్ద పూలమాలలు, పుష్పాలు ఉంచి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దళితవాడలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీచేశారు. కార్యక్రమంలో మణిప్రభాకరరావు సోదరుడు శివరామకృష్ణ, గ్రామ ప్రముఖులు అనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, దాసి సీతారామరాజు, ఓగిరాల నాగమల్లేశ్వరరావు, మాస్టారి శిష్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్టీసీ కష్టాలు

- ఖాళీ లేకుండా బస్సులు
- ఎక్కేందుకు ఇబ్బందులు


పెడన, గుడ్లవల్లేరు వెళ్లే బస్ ఫుల్‌గా ఉండటంతో ఎక్కలేక ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణం పుణ్యమా అని విద్యార్థులకు బస్సు ప్రయాణ కష్టాలు తప్పడం లేదు. బస్సు పాసులు కొనుగోలు చేసి, వారు చదువుకునే విద్యాసంస్థలకు వెళ్లేందుకు బస్సులు ఎక్కలేని పరిస్థితి నెలకొనడంతో ఇబ్బంది పడుతున్నారు. మచిలీపట్నం నగరంతో పాటు పెడన, గుడ్లవల్లేరు మండలంలోని పలు విద్యా సంస్థలకు వెళ్లే విద్యార్థులు బస్ సర్వీసులు పూర్తిస్థాయిలో లేక, ఒకవేళ ఉన్నా ఖాళీ లేని పరిస్థితులు ఎదురవుతున్నాయి. నగర శివారులోని కృష్ణా యూనివర్సిటీ, పెడన, గుడ్లవల్లేరులలోని ఇంజినీరింగ్ కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఉచిత బస్సు పుణ్యమా అని బస్సుల్లో ఖాళీ లేని పరిస్థితి ఏర్పడుతుండడంతో పలు స్టాపుల వద్ద బస్సు ఎక్కేందుకు వేచి ఉన్న విద్యార్థులకు ఆయా బస్సులు ఖాళీ లేక ఎక్కలేకపోతున్నారు. బస్సు పాసులు ఉన్నా ఎక్కలేని పరిస్థితులు ఎదురవుతున్నాయని వాపోతున్నారు. విద్యాసంస్థల ప్రారంభం, ముగింపు సమయాల్లో బస్సులెక్కేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఉదయం కళాశాలలకు సకాలంలో వెళ్లలేకపోతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. ఆయా సమయాల్లో ఆర్టీసీ అధికారులు మరిన్ని బస్ సర్వీసులను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

వైభవంగా గంగానమ్మ జాతర ప్రారంభం


సముద్ర స్నానానికి ఘటాలతో ర్యాలీగా బయలు దేరిన గ్రామస్తులు

బంటుమిల్లి: మండల పరిధిలోని రామవరపుమోడి గ్రామంలో కొలువై ఉన్న గ్రామ దేవత గంగానమ్మ జాతర బుధవారం నుంచి పెద్దల పర్యవేక్షణలో వైభవంగా ప్రారంభమైంది. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే జాతరను గ్రామస్తులు అత్యంత భక్తి, శ్రద్ధలతో చేసుకుంటారు. ఇందులో భాగంగా ఉదయం మేళతాళాలు, కనకతప్పెట్లు, డీజే పాటలతో అమ్మవారి గుడిలోని ఘటాలను నెత్తికి ఎత్తుకుని గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. జాతర ప్రారంభంలో భాగంగా గ్రామ పొలిమేరల్లో పోతురాజు స్తంభం పాతి అన కట్టారు. అనంతరం ద్విచక్ర వాహనాలు, వ్యాన్‌లు, ట్రాక్టర్లలో వందలాది మంది మహిళలు, పురుషులు, పిల్లలు అమ్మవారి ఘటాలను ఊరేగించుకుంటూ బందరు మండలం పెదపట్నం శివారు గొల్లగూడెం వద్ద సముద్ర స్నానం చేయించి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన బంధువులు, కుటుంబ సభ్యులతో గ్రామంలో సందడి నెలకొంది. ఈ నెల 14వ తేదీతో జాతర ముగుస్తుందని గ్రామ పెద్దలు తెలిపారు.

15న రాష్ట్ర లేబర్ కమిషన్ కార్యాలయం వద్ద ధర్నా


అవనిగడ్డలో ధర్నా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు

అవనిగడ్డ: ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15వ తేదీన రాష్ట్ర లేబర్ కమిషన్ కార్యాలయం వద్ద చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ అనుబంధ ఏపీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు యాసం శ్రీనివాసరావు పిలుపు నిచ్చారు. ఈమేరకు బుధవారం స్థానిక కార్యాలయం వద్ద ధర్నా పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు అన్నపరెడ్డి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి యాసం శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు మాదాసు కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఒక కుటుంబంలోని ఓటర్లంతా ఒకే బూత్‌లో


బీఎల్‌వోల సమావేశంలో దిశా నిర్దేశం చేస్తున్న కమిషనర్ చంద్రశేఖరరెడ్డి

పెడన: ఒక కుటుంబంలోని ఓటర్లంతా ఒకే బూత్‌లో ఓటు హక్కు కలిగి ఉండేలా చూడాల్సిన బాధ్యత బీఎల్‌వో(బూత్‌స్థాయి అధికారులు)లదేనని మున్సిపల్ కమిషనర్ ఎల్.చంద్రశేఖరరెడ్డి స్పష్టం చేశారు. ఆయన బుధవారం తన చాంబరులో పట్టణంలోని 23 వార్డులకు సంబంధించిన బీఎల్‌వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితాలు పక్కాగా ఉండాలని, అందుకు తగ్గ చర్యలు తీసుకోవాలని ఇటీవల ఎన్నికల సంఘం ఆదేశించిన విషయంపై కమిషనర్ బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఒకే డోర్ నంబరుతో కుటుంబ సభ్యులుండాలని, వేర్వేరు కుటుంబాల వారు ఉండకూడదన్నారు. అలా ఉన్నవారిని గుర్తించి ఆ డోర్ నంబరు స్థానంలో బై వన్, టులుగా గుర్తించి ఇవ్వాలని అది కూడా ఓటు హక్కు కలిగి ఉన్న వారికి మాత్రమే ఇవ్వాలన్నారు. జాబితాల్లో డబుల్ ఎంట్రీ ఓటర్లను తొలగించాల్సి ఉంటుందని, ఒకటికి రెండుసార్లు క్రాస్ చెక్ చేసి సదరు ఓటరు వివరాలకు సంబంధించి నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేయాలన్నారు. వారి తుది నిర్ణయం మేరకు ఓటర్ల తొలగింపులు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కొత్త ఓటర్ల చేర్పులు కూడా ఎలా పడితే అలా కాకుండా నిర్దిష్టమైన విచారణ చేపట్టి నిజమే అని రూఢి అయ్యాక జాబితాలో పేరు చేర్పించాల్సి ఉంటుందన్నారు. అందుకు తగ్గ ఫారాలను పూర్తి చేసి ఇచ్చేలా కొత్త ఓటర్లను చైతన్యపరచాల్సిందిగా సూచించారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ రాజా, టీపీవో సుజన కుమారి, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరం

విజిలెన్స్ ఈఈ సీహెచ్ వాసు

కోనేరుసెంటర్: విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని విజిలెన్స్ ఈఈ సీహెచ్ వాసు అన్నారు. బందరు మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం విద్యుత్ శాఖ అధికారులు అక్రమ విద్యుత్ కనెక్షన్‌లను గుర్తించే క్రమంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మండలంలో 34 బృందాలుగా ఏర్పడిన అధికారులు 2794 గృహ సర్వీసులు, 131 వాణిజ్య సర్వీసులు, 228 ఆక్వా సర్వీసులను తనిఖీ చేశారు. వాటిలో 310 సర్వీసులకు 440 కే డబ్ల్యూకి రూ.10,67,000 జరిమానా విధిస్తూ వినియోగదారులకు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యానికి పాల్పడే వారిని ఉపేక్షించేది లేదన్నారు. వినియోగదారులు ఎవరైనా విద్యుత్ చౌర్యం చేస్తున్నట్లు తెలిస్తే 94408 12091, 94408 12362, 94408 12363 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని ప్రజలను కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ దాడుల్లో మచిలీపట్నం ఈఈ గోవిందరావు, బందరు రూరల్ సబ్ డివిజన్ ఏడీ ఈకే రామకృష్ణ, రూరల్ ఏఈ పి.ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయురాలికి సత్కారం



గూడూరు: మల్లవోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోషల్ టీచర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన ఉమా కోటేశ్వరమ్మను బుధవారం ఘనంగా సత్కరించారు. పాఠశాల హెచ్ఎం చింతా మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మచిలీపట్నం డీవైఈఓ బీఎస్‌సీ శేఖర్‌సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొని ఉమాకోటేశ్వరమ్మ దంపతులను ఘనంగా సన్మానించారు. ఎంఈఓ-2 పి.సుబ్రహ్మణ్యం, ముదిగొండ శాస్త్రి, ఉదయ్‌కుమార్, అంబటిపూడి సుబ్రహ్మణ్యం, కె.బాలశైలజ, పద్మజా సీతా జ్ఞానేశ్వరి తదితరులు పాల్గొన్నారు.